క్లుప్తంగా

బ్లాక్‌లో పాలప్యాకెట్ల విక్రయం!

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఒకపక్క వరద ముంపుతో అల్లాడుతున్న ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. నగరంలో పాలప్యాకెట్ల కొరత నెలకొనటంతో ప్రజల అవసరాలను వ్యాపారులు క్యాష్ చేసుకుంటున్నారు. గద్దె వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్య కాలనీ ప్రాంతాల్లో రూ.39 ఎమ్మార్పీ ఉన్న విజయ గోల్డ్‌ప్లస్ పాలప్యాకెట్‌లను రూ.45కు విక్రయిస్తున్నారు. కేవలం తమ వద్ద విజయ గోల్డ్‌ప్లస్ పాలప్యాకెట్‌లు మాత్రమే ఉన్నాయంటూ వ్యాపారులు చెబుతుండటం గమనార్హం. చేసేదేమీ లేక రూ.45కు పాలప్యాకెట్‌లను కొనుగోలు చేస్తున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సహాయక శిబిరాలకు ప్రత్యేక అధికారుల కేటాయింపు

పటమట(విజయవాడతూర్పు): వరద ముంపు కారణంగా బాధితులను ఆదుకునేందుకు తీసుకునే చర్యల్లో భాగంగా వీఎంసీ ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేసిందని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాశక్తినగర్ కమ్యూనిటీ హాల్ సహాయక అధికారిగా ఎం.ఏసు 98859 81099, లగడపాటి రాజగోపాల్ కల్యాణ మండపానికి జయరాజు 90521 36895, కండ్రిక నేతాజీ సుభాష్‌చంద్రబోస్ నగర్ కమ్యూనిటీ హాల్‌కు నాగార్జున 97012 53226 బాధితులకు అందుబాటులో ఉంటారన్నారు. వీరికి ఆయా కేంద్రాలకు ఆహార సరఫరాకు బి.గోవిందరావు 98486 64889 నంబర్‌లో సంప్రదించాలని ఆయన తెలిపారు. వరద ప్రాంతాల్లో చెట్లు కొట్టుకువచ్చినా, విరిగిపోయినా వాటిని తొలగించేందుకు విక్టర్‌బాబు 99599 11593, సత్యనారాయణ 93900 40639, 97054 38282 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. బాధితుల సహాయార్థం వీఎంసీ హెల్ప్‌లైన్ నంబర్లు 0866 2424172, 2427485, వాట్సాప్ 81819 60909లో సంప్రదించాలని పేర్కొన్నారు. విజయవాడను వరద ముంచెత్తడంతో సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ప్రతి ప్రాంతానికి శానిటరీ ఇన్‌స్పెక్టర్, వార్డు స్పెషల్ ఆఫీసర్లుగా విజయవాడ నగరపాలక సంస్థ అధికారి, స్పెషల్ ఆఫీసర్ రిలీఫ్ ఆపరేషన్స్‌గా ఐఏఎస్ అధికారి, వార్డు సెక్రటరీలతో ఈ బృందం పనిచేస్తుందని తెలిపారు.

ఆహారం నేలపాలు



విజయవాడస్పోర్ట్స్: బుడమేరు వరద బాధితులకు సాయం చేయడంలో ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. బాధితులకు పంపిణీ చేసేందుకు ఓ స్వచ్ఛంద సంస్థ సోమవారం ఉదయం పులిహోర పొట్లాలతో సింగ్‌నగర్ ఫ్లైఓవర్ వరకు చేరుకుంది. అక్కడ బాధితుల సంఖ్య విపరీతంగా పెరిగిపోవడం.. అప్పటికే రెండు రోజుల పాటు ఆహారం లేక ఖాళీ కడుపులతో ఉన్న బాధితులు ఒక్కసారిగా ఆ వాహనాన్ని చుట్టుముట్టారు. అక్కడే ఉన్న పోలీసులు వారిని వరుసలో ఉంచేందుకు కనీస చర్యలు తీసుకోకుండా చోద్యం చూడటంతో ఆహారం నేలపాలైంది. ప్యాకెట్‌లతో కూడిన సంచుల కోసం అక్కడ ఉన్న జనం తోసుకోవడంతో వ్యాన్ నుంచి ఫుట్‌పాత్‌పై పడేశారు.

మనోహరం వాగ్గేయకార సంకీర్తనం



విజయవాడ కల్చరల్: సంగీత విద్వాంసుడు లంకా వెంకటేశ్వర్లు సంస్మరణ సందర్భంగా దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న వార్షిక సంగీతోత్సవాలు శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటుతున్నాయి. సోమవారం తొలి కార్యక్రమంగా సుబ్రహ్మణ్య సంగీత సమితి విద్యార్థుల వీణావాద్య కచేరి ఆకట్టుకుంది. ఆర్.శ్రీమణి కంఠకౌస్తుభ త్యాగరాజ కృతులను ఆలపించారు. చివరిగా సంగీత విద్వాంసులు డాక్టర్ మోహన్ శర్మ, స్వాతి రంగనాథ్ పలు సంప్రదాయ కృతులను ఆలపించారు. వయోలిన్‌పై కేవీ కృష్ణ, మృదంగంపై సుబ్బరాయఫల్గుణ్ ఘటంపై ఎం.హరిబాబు సహకరించారు. సంగీత కళాకారులు సుబ్రహ్మణ్యం, గాయత్రి విభావరి, సూర్య పాల్గొన్నారు.

బుడమేరు ముంచేసింది



దావు బుచ్చయ్యకాలనీలో రోడ్డుపై ప్రవహిస్తున్న బుడమేరు



ప్రకాశం బ్యారేజీ వద్ద వరద నీరు

- తప్పని వరద కష్టాలు
- అంతంత మాత్రంగా సేవలు



చెయ్యి చాపిన ఆకలి.. దేవీనగర్‌లో ఆహార పదార్థాలు, నీటి ప్యాకెట్ల కోసం ఎగబడుతున్న బాధితులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు ఉగ్రరూపం సోమవారం కూడా కొనసాగింది. ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ప్రవాహం కొనసాగుతోంది. బుడమేరు వరద ధాటికి మూడోరోజు కూడా వరద నీటిలోనే ఇళ్లు, రోడ్లు ఉన్నాయి. బయటకు వచ్చే దారి లేక తాగడానికి తాగునీరు, తినడానికి ఆహారం, విద్యుత్ లేక నానాయాతన అనుభవిస్తున్నారు.అధికారులు, ఎన్‌డీఆర్‌ఎఫ్, స్వచ్ఛంద సంస్థల సిబ్బంది కేవలం రోడ్డు బాగున్న, కొద్దిగా నీరు నిలిచిన ప్రాంతాల్లోనే ఆహార పదార్థాలు పంపిణీ చేస్తున్నారని నీటమునిగిన శివారు ప్రాంతాలకు రావడంలేదని వాపోతున్నారు. ఆహార పదార్థాలు, తాగునీరు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నా అవసరమైన పడవలు, సిబ్బంది లేక ఇబ్బందులు తప్పడం లేదు. అయోధ్యనగర్‌లో బుడమేరుముంపు ప్రాంతాల్లో అవసరమైన మరమ్మతులను వీఎంసీ ఢీఈ గుర్నాథం పర్యవేక్షణలో జరుగుతున్నాయి. సోమవారం సాయంత్రానికి బుడమేరు ఉధృతి ఒకింత తగ్గినా దేవీనగర్, రామకృష్ణాపురం, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంతాల్లో ప్రవాహం కొనసాగుతుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. జీవీఆర్ నగర్, బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ ప్రాంతాల్లో వరద నివారణ చర్యలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హైడ్రా తరహా చర్యలు తీసుకోవాలి

బుడమేరు ముంపు నివారణకు హైదరాబాద్ హైడ్రా తరహా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. బుడమేరులో ఇష్టారాజ్యంగా ఆక్రమణలు చేయటం, లే అవుట్‌లేని జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్‌లో ప్లాట్ల కారణంగా ఇబ్బందులు తలెత్తాయని వాపోతున్నారు. లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించుకున్న ఇళ్లు వరద ముంపు బారినపడటం, తమకు భద్రత లేకపోవడంపై స్థానికులు విచారం వ్యక్తంచేస్తున్నారు.

జల దిగ్బంధంలో..



నూజివీడు రోడ్డుపై ప్రవహిస్తున్న వరద

పాయకాపురం(విజయవాడరూరల్): నగర శివారు ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. కండ్రిక, రాజీవ్‌నగర్, పాతపాయకాపురం, శాంతినగర్, ఎల్‌బీఎస్ నగర్, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో నివసిస్తున్న వేలాది కుటుంబాల ప్రజలు మూడు రోజులుగా వరదలోనే చిక్కుకున్నారు. కొందరు డాబాలపైకి ఎక్కి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. మూడు రోజులుగా తాగడానికి నీళ్ల లేక, తిండిలేక అల్లాడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ చర్యలు లేకపోవడంతో ఎవరైనా రాకపోతారా అని ఎదురుచూస్తున్నారు. ఈ ప్రాంతంలో లగడపాటి కల్యాణమండపంలో పునరావాసకేంద్రాన్ని ఏర్పాటు చేశారుగానీ అక్కడ గుక్కెడు మంచినీళ్లు కూడా దొరకని పరిస్థితిలో బాధితులు ఎదురుచూస్తున్నారు.

- నున్న గ్రామానికి చెందిన పలువురు మానవతా దృక్పథంతో ట్రాక్టర్లపై ఫుడ్‌ప్యాకెట్లు, మంచినీటి బాటిల్స్ తీసుకెళ్లి కండ్రిక, పాయకాపురం ప్రాంతాల్లోని వరద బాధితులకు అందజేస్తున్నారు.

మూడు రోజులుగా నీటిలోనే..



మూడు రోజులుగా నీటిలోనే పిల్లలతో ఉంటున్నాం. మమ్మల్ని ఎవరూ పట్టించుకోవడంలేదు. ఇంటిలో నీరు, చుట్టూ నీరే ఉండటంతో బయటకు వెళ్లే పరిస్థితి లేక తినడానికి తిండిలేదు. మూడు రోజులుగా కరెంటు లేదు. మా ఇబ్బందులు చెప్పుకోవడానికి ఫోన్లు పని చేయడంలేదు.

– కె.ధనమ్మ, కండ్రిక

విజయ డెయిరీ ఆధ్వర్యంలో పాలు, బటర్ మిల్క్ పంపిణీ



ఫ్యాక్టరీలో సిబ్బందికి సూచనలిస్తున్న చైర్మన్ ఆంజనేయులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ది కృష్ణా మిల్క్ యూనియన్ (విజయ డెయిరీ) వరద ముంపు బాధితులకు తమ వంతుగా సాయం అందించారు. నగరంలోని పలు ముంపు ప్రాంతాల్లో విజయ పాలు, బటర్ మిల్క్‌ను ఉచితంగా అందజేసినట్లు చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. సింగ్‌నగర్, కేఎల్‌రావునగర్‌తో పాటు గొల్లపూడి పరిసర ప్రాంతాల్లో 35 వేల లీటర్ల పాలు, 40 వేల లీటర్ల బటర్ మిల్క్‌ను అందజేశామన్నారు. సోమవారం విజయ అవుట్‌లెట్స్‌లో వినియోగదారులందరికీ పాలు అందించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. పాల ప్రాజెక్టును ఎమ్మెల్యే సుజనా చౌదరి సోమవారం సందర్శించారు. వరద ప్రభావంతో ఫ్యాక్టరీ లోపల దెబ్బతిన్న పాల పదార్థాలు, మిషనరీతో పాటు దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ గురించి చైర్మన్ చలసాని ఆంజనేయులు ఎమ్మెల్యేకు వివరించారు.

సామాజిక బాధ్యతగా ఆహార పొట్లాల పంపిణీ



ఆహార పొట్లాలు పంపిణీచేస్తున్న డాక్టర్ చల్లా హరికుమార్ తదితరులు



వరద బాధితులకు భోజనాలు వడ్డిస్తున్న ప్రభాస్ ఫ్యాన్స్ నగర అధ్యక్షుడు మురళీకృష్ణంరాజు



రామకృష్ణాపురంలో అల్పాహారం పంపిణీ చేస్తున్న గౌతంరెడ్డి



శ్రీదత్తసాయి మందిరంలో భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): సామాజిక బాధ్యతగా వరద బాధితులకు పలువురు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరం ఆలయ కమిటీ ఆధ్వర్యాన సోమవారం అల్పాహారం, భోజనాలు పంపిణీ చేశారు. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అందజేశారు.

దేవీనగర్‌లో..

దేవీనగర్‌లో వరద బాధితులకు వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, సభ్యులు మధుసూదనరావు, వెంకటేష్ గోదావరి తదితరులు పాల్గొన్నారు.

బుడమేరు మధ్యకట్టలో..

బుడమేరు మధ్యకట్టలో దావు బుచ్చయ్యకాలనీ శ్రీశ్యామలాంబదేవి అమ్మవారి దేవాలయం ధర్మకర్త చింతపల్లి కనకారావు ఆధ్వర్యాన సుమారు మూడు వేలమంది వరద బాధితులకు భోజనాలు అందజేశారు.

ప్రభాస్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో..

సిటీ వైడ్ ప్రభాస్ ఫ్యాన్స్ ఆధ్వర్యాన సోమవారం వరద బాధితులకు పాల ప్యాకెట్లు, భోజనాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రభాస్ ఫ్యాన్స్ నగర అధ్యక్షుడు డి.మురళీకృష్ణంరాజు, అప్పలరాజు, చక్రధర్‌తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద ముంపు ప్రాంతాల్లో సోమవారం వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యాన వరద బాధితులకు ఆహారం, తాగునీరు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ అంతర్జాతీయ అధ్యక్షుడు వేముల హజరత్తయ్యగుప్తా, జిల్లా గవర్నర్ కొత్త గణేష్ బాబు, మావిడి శ్రీనివాసరావు, ముచ్చర్ల శ్రీనివాసరావు, గోపాలకృష్ణ, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో వరద ముంపు బాధితులకు ప్రత్యేక పూజలు చేసి భోజనాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు పర్యవేక్షించారు.

బిక్కు బిక్కు మంటూ..



వాహనాలు ఏర్పాటు చేయకపోవడంతో నడుచుకుంటూ వెళ్తున్న గర్భిణి

పటమట(విజయవాడతూర్పు): బుడమేరు జలవిలయానికి వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. వరద సహాయ చర్యలు నామమాత్రంగా ఉండటంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల నుంచి వరద ప్రభావం ఉండటంతో అజిత్ సింగ్‌నగర్, పాయకాపురం,పైపులరోడ్డు, ఎల్‌బీఎస్ నగర్, నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌నగర్, ఆంధ్రప్రభ కాలనీ, నందమూరినగర్, కండ్రిక, రాజీవ్‌నగర్, వాంబేకాలనీ, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా, తాగునీటి సరఫరా లేకపోవటంతో బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఓవైపు వరద మరోవైపు కీటకాలు, పాముల భయంతో రాత్రుళ్లు దిక్కుతోచని స్థితిలో కాలం గడిపారు. ప్రభుత్వ సాయం అరకొరగా ఉండటంతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆహార పొట్లాలు, ఇతర ఆహార పదార్థాలు, తాగునీరు, చంటిపిల్లలకు పాలు, వృద్ధులు, పేషెంట్లకు మందులు ఇవ్వడంలో పూర్తిస్థాయిలో అధికార యంత్రాగం విఫలమైందని బాధితులు ఆరోపిస్తున్నారు. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో బాధితులకు అందించేందుకు పాల ప్యాకెట్ల వాహనం రావటంతో ఒక్కసారిగా అక్కడ ఉన్నవారంతా వాటిని తీసుకునేందుకు రావటంతో స్థానికంగా కొద్దిసేపు తొక్కిసలాట జరిగింది. పునరావాస కేంద్రాలు మునకలోనే ఉండటంతో బాధితులు అవస్థ పడ్డారు.



సింగ్‌నగర్‌లో ట్యూబులు, థర్మాకోల్ షీట్లతో ఒడ్డుకు చేరుకుంటున్న వరద బాధితులు



ఫైబర్‌వాటర్ ట్యాంకులు కట్‌చేసి బాధితులు, సామాన్లు తరలింపునకు యత్నిస్తున్న స్థానికులు

పట్టించుకోలేదు



రాజీవ్ నగర్ 63వ డివిజన్ ప్రాంతంలో వరద నీరు వచ్చి మా కుటుంబ సభ్యులు చిక్కుకు పోయారు. మూడు రోజుల నుంచి పడవ కోసం పలుమార్లు అధికారులను, హెల్ప్‌లైన్‌కు సంప్రదించాం. వస్తున్నామని అంటున్నారు కానీ, కనీస బాధ్యత వహించడం లేదు. మంత్రులు వచ్చి ఫొటోలు దిగారు.. పట్టించుకోలేదు.

– ఎం.శ్రీను, రాజీవ్‌నగర్

మా కుటుంబాన్ని ఆదుకోండి



కండ్రికలో వరద ముంపు నీరు వచ్చి చేరింది. రాష్ట ప్రభుత్వం సాయం చేసినట్లు కనిపించడం లేదు. ఈ ప్రాంతాన్ని సందర్శించేందుకు వచ్చిన మంత్రులను సైతం నిలదీసినా అదిగో.. ఇదిగో అంటు వెనుదిరిగారు. సాయం చేయలేదు. మా గోడు వినే వారు లేరు. మా సంస్థ యజమాని మాకు సాయం చేశారు.

– రమాదేవి, కండ్రిక

నా భార్యకు గుండె జబ్బు.. మందుల్లేవు



ఉడా కాలనీలో నా భార్య రాజ్యం ఉంది. ఆమెకు గుండె జబ్బు. వరదలతో నేను బయట ఇరుక్కుపోయాను. మందులు ఇచ్చేందుకు వీలు లేకుండా ఉంది. అధికారులు ఏర్పాట్లు చేస్తారని హెల్ప్ బోర్డు పట్టుకుని సాయం కోరుతున్నాను. కాలనీలో పిల్లలు, వృద్ధులు మంచినీరు, మందులు, ఆహారం అందక ఇబ్బందులు పడుతున్నారు. వారికి సాయం అందించడానికి సత్వర చర్యలు తీసుకోవాలి.

– నూతులపాటి జయపాల్, ఉడా కాలనీ

రంగస్థల నటుడు జొన్నలగడ్డకు గౌరవ డాక్టరేట్



విజయవాడ కల్చరల్: నగరానికి చెందిన రంగస్థల నటుడు, దర్శకుడు ప్రయోక్త జొన్నల గడ్డ జగన్మోహరావుకు గౌరవ డాక్టరేట్ లభించింది. ఆమెరికాకు చెందిన పీస్ యూనివర్సిటీ ఏటా వివిధ రంగాల్లోని వారి సేవలను గుర్తించి వారికి గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేస్తుంది. పీస్ సంస్థ హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పురస్కారం ప్రదానం చేశారు. పురస్కారం అందుకున్న జొన్నలగడ్డను పలు సాంస్కృతిక సేవా సంస్థలు అభినందించాయి.

వరద బాధితులకు ఎక్సైజ్ శాఖ సాయం



సాక్షి ప్రతినిధి, విజయవాడ: విజయవాడ నగరంలో వరద బాధితులకు ఎక్సైజ్ శాఖ సాయం అందించింది. భవానీపురంలోని వరద బాధితులను ఆదుకోవడానికి సోమవారం ప్రత్యేక సహాయ బృందాలను ఏర్పాటు చేసి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకొని బాధితులకు కావాల్సిన సదుపాయాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ఐదువేల ఆహార పొట్లాలను, ఐదు వేల మంచినీటి బాటిళ్లను, పాలు, మజ్జిగను ఎక్సైజ్ శాఖ సిబ్బంది అందజేశారు. రాష్ట్ర మద్య నిషేధ, అబ్కారీ శాఖ కమిషనర్ నిశాంత్ కుమార్ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ఎక్సైజ్ శాఖ సిబ్బందికి సూచనలు చేసి, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

పునరావాస కేంద్రాల్లో సౌకర్యాలు నిల్

పటమట(విజయవాడతూర్పు): వరద ప్రభావానికి ముంపునకు గురైన వారికి వీఎంసీ కల్పిస్తున్న పునరావాస కేంద్రాలు అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఇక్కడ విధులు నిర్వహించాల్సిన సిబ్బంది అడ్రస్ లేకపోవటంతో నిర్వాసితులు వారి సమస్యలను చెప్పుకోలేని స్థితి నెలకొంది. ఆహారాన్ని కూడా సక్రమంగా అందించలేకపోవడంతో దాతలను బతిమాలాడుకుని కడుపునింపుకోవాల్సిన దుస్థితి నెలకొందని పునరావాసలో ఉంటున్న నిర్వాసితులు పేర్కొంటున్నారు. విజయవాడ నగరపాలక సంస్థ నగరంలోని 12 ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు కల్పిస్తే అందులో పట్టుమని 300 మంది కూడా ఉండటానికి ఇష్టపడటం లేదు. సత్యనారాయణపురంలోని సర్కిల్–2 కార్యాలయం వెంబడి ఉన్న ప్రశాంతి నగరపాలక సంస్థ ప్రత్యేక పాఠశాలలో సౌకర్యాలను సోమవారం రాత్రి 'సాక్షి' పరిశీలించగా అందులో నిర్వాసులంతా తమ గోడును వెళ్లబుచ్చుకున్నారు. ఇళ్లలో ఉన్నవారిని పునరావాస కేంద్రాలకు రావాలని ఒత్తిడి చేసి ఇక్కడికి తీసుకువచ్చారు. అయితే ఇక్కడ అరాకొర సౌకర్యాలు ఉండటం, సమయానికి భోజనాన్ని అందించకపోవటం, బాలింతలు, గర్భిణులు, వృద్ధులున్నప్పటికీ వారికి సరైన సౌకర్యాలు కల్పించలేకపోవడంతో చాలా మంది బంధువుల ఇళ్లకు వెళ్లిపోయారు. నగర వ్యాప్తంగా ఉన్న ఆయా కేంద్రాల్లో ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేసినా వారందరూ కేంద్రాల్లో అందుబాటులో ఉండటంలేదని నిర్వాసితులు వాపోతున్నారు.

మాగోడు వినిపించుకోవటంలేదు



అధికారులు పునరావాస కేంద్రానికి తీసుకువచ్చారు. ఇక్కడ భోజనం కూడా పెట్టడంలేదు. ఇక్కడికి వచ్చి రెండురోజులవుతోంది. మమ్మల్ని పట్టించుకునేవారు లేరు. ఉదయం, సాయంత్రం అధికారులు నామమాత్రంగా వచ్చి వెళ్తున్నారే తప్పా మా గోడు వినిపించుకోవటంలేదు. చాలామందికి జ్వరాలు వస్తున్నాయి.

– శంకర్, వరద బాధితుడు